ప్రజాశక్తి
శనివారం 20 మే 2023
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి





సుందరయ్య స్ఫూర్తితో..

మరో స్వాతంత్ర్య పోరాటం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ



సుందరయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న శర్మ, వేదికపై జగ్గునాయుడు, పద్మనాభరాజు, కెఎం.శ్రీనివాస్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)
బ్రిటీష్ దోపిడీకి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం నడిపిన పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో మరో స్వాతంత్ర్య పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పిలుపునిచ్చారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభ శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంవిఎస్.శర్మ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ దోపిడీకి గురౌతున్న ప్రజల తరుఫున ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. పేదల పక్షాన నిలిచారన్నారు. నాటి బ్రిటీష్ తెల్లదొరలు, హైదరాబాద్ నైజాం పాలకులు ప్రజలను పీడించి తమ లాభాల కోసం, అవసరాల కోసం శ్రమ దోపిడీ చేసేవారని, దేశంలో ఉండే సహజ వనరులు, సంపద, పంటను సైతం సామ్రాజ్యవాద దేశాలకు తరలించుకుపోయేవారని తెలిపారు. వలస దేశంగా ఉన్న భారతదేశాన్ని మనమే పరిపాలన చేసుకోవాలని కమ్యూనిస్టు, విప్లవ గ్రూపులు కాంగ్రెస్‌తో కలిసి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నాయని గుర్తు మిగతా 2లో..



అనకాపల్లిలో రోడ్‌షో నిర్వహిస్తున్న చంద్రబాబు, భారీ సంఖ్యలో హాజరైన టిడిపి కార్యకర్తలు

గెలిపిస్తే..

బెల్లం మార్కెట్‌కు పూర్వ వైభవం

◆ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు హామీ ◆ అనకాపల్లిలో రోడ్‌షో, సభ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి
టిడిపి ప్రభుత్వం రూ.35 కోట్లు ఖర్చు చేసి తుమ్మపాల చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తే వైసిపి ప్రభుత్వం మూసేసిందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి నెహ్రూ చౌక్ వద్ద జరిగిన 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' ముగింపు సభలో ఆయన మాట్లాడారు. టన్ను చెరుకుకు రూ.3,500 ఇస్తానని చెప్పి జగన్మోహన్ రెడ్డి ఇవ్వలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు పూర్వ వైభవం తెస్తామన్నారు. తాను అధికారంలో ఉంటే ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తిచేసి వంశధార నది వరకు అనుసంధానం పూర్తయ్యేదని అన్నారు. అనకాపల్లిలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తామన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ విస్సన్నపేటలో భూమి సహా, కొండలు, గుట్టలు మిగతా 2లో..

డిఆర్ఎం కప్ హంగామా ప్రారంభం

▶ వార్త 2లో..

స్టీల్‌ప్లాంట్‌కు మూలధనం సిద్ధం : కెఎ.పాల్

▶ వార్త 2లో..

సంక్షేమంలో వాలంటీర్ల పాత్రే కీలకం

▶ వార్త 2లో..



వర్షంలోనే సాగుతున్న రాకపోకలు

కూల్.. కూల్..

విశాఖలో సాయంకాలం చిరుజల్లులు
చల్లబడ్డ నగరం.. సేదతీరిన జనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : శుక్రవారం సాయంకాలాన.. చల్లని గాలులు, చిటపటా చినుకులు విశాఖను పలకరించాయి. కొద్ది రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనానికి తాజా వాతావరణం కాసింత హాయిగా అనిపించింది. అంతా ఇళ్ల నుంచి బయటకు వచ్చి సేదతీరారు. ఎన్ఎడి, మిగతా 2లో..

డిపిఆర్‌లో మార్పులు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రూ.152 కోట్లతో ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు చేపడుతున్న నేపథ్యంలో రూపొందించిన డిపిఆర్ మత్స్యకారులకు ఆమోదయోగ్యం కాదని, మత్స్యకార సంఘాలతో చర్చించి వారి అభీష్టం మేరకు డిపిఆర్‌లో మార్పులు చేసి పనులు చేపట్టాలని శుక్రవారం ఫిషింగ్ హార్బర్ గంగాలమ్మ గుడి వద్ద జరిగిన మత్స్యకారుల అఖిలపక్ష ఫిషింగ్ హార్బర్ యూనియన్ల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. చేపలు పాట (ఆక్షన్ హాల్)ను యథాస్థానంలో ఉంచి అభివృద్ధి చేయాలని, అదనంగా చేపలు పాటలు అవసరం లేదని సమావేశం తెలిపింది. ఫింగర్ జెట్టీలు నిర్మించాలని, ఫ్లోటింగ్ జెట్టీలు వద్దని, బోట్లు అండర్‌వాటర్ రిపేర్లుకు తగిన స్థలం కేటాయించి వసతులు కల్పించాలని, బోట్లుకు ప్రమాదం జరిగి నీటిలో మునిగిపోయే సమయంలో వాటిని బయటకు తీయడానికి భారీ క్రేన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. బోట్లుకు ఐస్ లోడింగ్ చేయడానికి ఇతర రాష్ట్రాల హార్బర్లలో వినియోగిస్తున్నట్లు మిషన్లు ఏర్పాటు చేయాలని, వేటాడి తెచ్చిన మత్స్య సంపద, నెత్తలు, మొదలగు చేపలను ఎండబెట్టుకోవడానికి స్థలాన్ని కేటాయించాలని కోరింది. హార్బర్‌లో మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఒకటో నెంబరు జెట్టీలో ఉన్న ప్రైవేట్ వెసల్స్‌ను వెంటనే తొలగించాలని, టూరిజం బోట్లు తిరగడానికి అనుమతించకూడదని, వాటిని రుషికొండకు తరలించే ఏర్పాట్లు చేయాలని పేర్కొంది.

స్టీల్‌ప్లాంట్‌కు మూలధనం సిద్ధం

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కె.ఎ.పాల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడేందుకు కావాల్సిన రూ.4 వేల కోట్లు తన వద్ద సిద్ధంగా ఉన్నాయని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని తన ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన మూలధనం సమకూర్చానని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ఆ విషయాన్ని తెలియజేస్తూ.. అనుమతి కోరుతూ వచ్చానని తెలిపారు. జూన్ 4 వరకూ సమయం ఇచ్చానని పేర్కొన్నారు. ఆలోగా అనుమతి ఇవ్వకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. కేంద్రం తన ప్రతిపాదనకు అనుకూలంగా స్పందిస్తే 72 గంటల్లో రూ.4 వేల కోట్ల వైట్ మనీని చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు.

రైళ్ల సమయాల్లో మార్పులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైల్వేల పరిధిలోని వివిధ విభాగాల్లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్ల సేవల్లో మార్పులు చోటుచేసుకున్నాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని ఘట్‌కేసర్-చర్లపల్లి సెక్షన్ల మధ్య సేఫ్టీ వర్క్స్ కారణంగా 12703 హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మే 20న 3 గంటలు ఆలస్యంగా ఉదయం 08.35 గంటలకు బదులు 11.35 గంటలకు హౌరా నుంచి బయలుదేరుతుంది. 11020 భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ భువనేశ్వర్ నుంచి మూడు గంటలు ఆలస్యంగా 15.20 గంటలకు బదులు సాయంత్రం 18.20కి భువనేశ్వర్ నుంచి బయలుదేరుతుంది. 18519 విశాఖపట్నం-ముంబై ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్ మే 20న గంట ఆలస్యంగా రాత్రి 23:20 గంటలకు బదులు అర్ధరాత్రి (మే 21) 00:20 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరుతుంది.

చక్రధర్‌పూర్ డివిజన్‌లో ట్రాఫీ కమ్ పవర్ బ్లాక్ కారణంగా 18107 రూర్కెలా - జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ మే 24న రద్దు చేయబడింది. 18108 జగదల్‌పూర్ - రూర్కెలా ఎక్స్‌ప్రెస్ కూడా రద్దయింది. 12836 ఎస్ఎంవి బెంగళూరు-హతియా ఎక్స్‌ప్రెస్ మే 23న 3:45 గంటలు ఆలస్యంగా నడుస్తుంది.

సంబల్‌పూర్ డివిజన్‌లో నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఈ నెల 27న విశాఖపట్నం నుంచి బయలుదేరే రైలు నెంబర్ 20807 విశాఖపట్నం-అమృత్‌సర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ అదే రోజున సాధారణ మార్గం విజయనగరం-ఖుర్దా రోడ్-భువనేశ్వర్-సంబల్‌పూర్‌కు బదులుగా విజయనగరం-తిట్లాగఢ్-సంబల్‌పూర్ మీదుగా మళ్లించబడుతుంది.

సికింద్రాబాద్ డివిజన్‌లోని చింతపల్లి-నెక్కొండ స్టేషన్లలో మూడో లైను ఆధునికీకరణ నేపథ్యంలో 18519 విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినల్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం నుంచి మే 21 నుంచి జూన్ 7 వరకు విజయవాడ-కృష్ణా కెనాల్ జంక్షన్-గుంటూరు-పగిడిపల్లి మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 22849 షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ మే 24 నుంచి 31 వరకు ఏలూరు-విజయవాడ-గుంటూరు-పగిడిపల్లి మీదుగా దారి మళ్లించిన మార్గంలో వెళ్తుంది. 18112 యశ్వంత్‌పూర్-టాటా నగర్ ఎక్స్‌ప్రెస్ మే 21, 28, జూన్ 4 తేదీల్లో సికింద్రాబాద్-పగిడిపల్లి-గుంటూరు మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 18046 హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మే 28, జూన్ 7 తేదీల్లో గుంటూరు - పగిడిపల్లి - సికింద్రాబాద్ మీదుగా దారి మళ్లించిన మార్గంలో వెళ్తుంది. ఈ నేపథ్యంలో ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ అధికారులు అభ్యర్థించారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

ప్రయాణికుల అవసరాల దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించాలని నిర్ణయించింది. 08543 విశాఖపట్నం-బెంగళూరు కాంట్ వీక్లీ స్పెషల్ రైలు మే 25 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 15:55 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు 12:30 గంటలకు బెంగళూరు కాంట్ చేరుకుంటుంది. 08544 బెంగళూరు కాంట్ విశాఖపట్నం వీక్లీ స్పెషల్ 26 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 15.50 గంటలకు బెంగళూరు కాంట్ నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

ఈ జంట రైళ్లు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, కుప్పం, బంగారుపేట, బెంగళూరు కెనకపట్నం, కృష్ణరాజపురం మీదుగా ప్రయాణిస్తాయని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి ఒక ప్రకటన లో తెలిపారు.

డిసిఐ ఛైర్మన్‌గా అంగముత్తు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : డిసిఐ అదనపు డైరెక్టర్, ఛైర్మన్‌గా విశాఖపట్నం పోర్టు అథారిటీ ఛైర్మన్ డాక్టర్ మడేయాన్ అంగముత్తు శుక్రవారం నియమితులయ్యారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను డిసిఐ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ శుక్రవారం అందజేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కలెక్టరేట్ : పందిమెట్ట ప్రాంతంలో మంచినీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని గురువారం సాయంత్రం ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వార్డు కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకురాలు కె.మణి మాట్లాడుతూ పందిమెట్ట ప్రాంతంలో చాలా కాలంగా తాగునీటి సమస్య ఉందన్నారు. ప్రజలకు అనువైన సమయంలో నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

డిఆర్ఎం కప్ హంగామా ప్రారంభం

ఉత్సాహంగా బాక్సింగ్ టోర్నీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్, వాల్తేరు ఆధ్వర్యంలో తలపెట్టిన డిఆర్ఎం కప్ స్టేట్ యూత్ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ విశాఖ పట్నంలోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్, బాక్సింగ్ హాల్‌లో శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కో-ఆర్డినేషన్) ఎకె.మోహరానా, స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటీతో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు.



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డిఆర్ఎం అనూప్ సత్పతి

మొదటి పేజీ తరువాయి..

సుందరయ్య స్ఫూర్తితో.. మరో స్వాతంత్ర్య పోరాటం

చేశారు. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడ్డాక దేశంలో కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, విద్యార్థులకు సంఘాలు ఏర్పాటు చేసి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిందన్నారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో దున్నేవానికి భూమి నినాదంతో తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి లక్షల ఎకరాలు భూమిని పేదలకు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీదన్నారు. సుందరయ్య తాను పుట్టిన అలగానిపాడు గ్రామంలో వ్యవసాయ కార్మికులకు, రైతులకు గ్రామస్థాయిలోనే సంఘం పెట్టి భూస్వాముల దోపిడీని ఎదిరించారన్నారు. ప్రజలు ధరాభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటే ఆయనే స్వయంగా పట్టణాల నుంచి నిత్యావసర సరుకులు తెచ్చి ప్రజలకు చౌకగా ఇచ్చేవారన్నారు. కల్లు, సారాకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపారన్నారు. దేశంలో దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరిచి, ఉద్యమాలు చేసి అనేక హక్కులు సాధించుకున్నారన్నారు.

నేడు భారతదేశంలో బ్రిటీష్ పాలన కంటే దారుణమైన పరిస్థితులున్నాయన్నారు. నాడు సాధించుకున్న కార్మిక హక్కులు, రైతు చట్టాలన్నీ పెట్టుబడిదారులకు కొమ్ముకాసేలా బిజెపి, వైసిపి పాలకవర్గాలు మార్పులు చేస్తున్నాయన్నారు. కొత్తగా ఒక్క పరిశ్రమ నెలకొల్పకుండా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అమ్మేస్తున్నారన్నారు. ప్రజల ఆస్తులను, సహజ వనరులను సైతం పెట్టుబడిదారులకు అప్పజెబుతున్నారని తెలిపారు. చరిత్ర దగ్గర నుంచి విద్య, వైద్యం, సాంస్కృతిక రంగంల్లో సైతం అనేక మార్పులు తెచ్చి దేశాన్ని అధోగతిపాలుజేస్తున్న బిజెపి, వైసిపి విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. భారతదేశాన్ని మోడీ, జగన్‌ల నుంచి, పెట్టుబడిదారుల నుంచి రక్షించుకోవాలని, అందుకు మరో స్వాతంత్ర్య పోరాటమే మార్గమని అన్నారు.

అనంతరం సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ప్రజాశక్తి పత్రిక సర్క్యులేషన్ పెంపు కోసం సుందరయ్య వర్ధంతి రోజు నుంచి జూన్ 6 వరకు అందరూ కృషి చేయాలన్నారు. కార్మిక, కష్టజీవుల పక్షాన నిలబడే ఆ పత్రికను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేయడం కోసం పత్రిక పెంపు అవసరమని నొక్కిచెప్పారు. కార్యక్రమంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం కోశాధికారి వివిఎస్.పద్మనాభరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు పాల్గొన్నారు.

కూల్.. కూల్..

సాగరతీర ప్రాంతాలు, కంచరపాలెం, సీతమ్మధార, మద్దిపాలెం తదితర చోట్ల వర్షం పడటంతో జనం ఉత్సాహంతో ఉరకలు వేశారు. గాజువాక, పెదగంట్యాడ, దువ్వాడ ప్రాంతాల్లో చల్లని గాలులు వీచాయి. గడచిన కొద్ది రోజులుగా ఎండలతో వాతావరణం మండిపోయిన సంగతి తెలిసిందే. సుమారు 42 డిగ్రీల ఉష్ణోగ్రతల వరకూ విశాఖ నగరంలో నమోదయ్యాయి. జిల్లా అంతటా ఎండ వేడిమికి తట్టుకోలేక వడదెబ్బకు అనేక మంది విలవిల్లాడిపోయారు. దాదాపు 15 రోజులుగా ఈ పరిస్థితులను విశాఖ వాసులు ఎదుర్కొంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో కురిసిన వర్షం ఎంతో ఆనందాన్నిచ్చింది. జనం కేరింతలు కొట్టడం ఎక్కడికక్కడే కనిపించింది.

నైరుతి అనుకూల పరిస్థితులు

ఈ నెల 19కి ఆగ్నేయ బంగాళాఖాతంలో కొన్ని ప్రాంతాలైన నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రంలో వర్షాలకు అనుకూల వాతావరణం ఏర్పడడమే శుక్రవారం సాయంత్రం నాటి చల్లని వాతావరణానికి కారణమని తెలుస్తోంది. నైరుతి రుతుపవనాలు రాబోయే 3-4 రోజుల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, ఇంకొన్ని ప్రదేశాల్లో ముందుకెళ్లే పరిస్థితులు నెలకొన్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం తాజాగా వెల్లడించింది. ఈ నెల 20 నాటికి నైరుతి రుతుపవనాలు బంగాళాఖాతంలోని దక్షిణ అండమాన్ సహా మరికొన్ని ప్రాంతాలకు, నికోబార్ దీవులకు విస్తరించే అవకాశాలున్నట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం నివేదిక వెల్లడించింది. ఏపీ, యానాంలలో ఆగ్నేయ, దక్షిణ దిశగా వీస్తున్న గాలులతో వాతావరణం చల్లబడింది.

గెలిపిస్తే బెల్లం మార్కెట్‌కు పూర్వ వైభవం

మింగేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో కొత్తగా ఒక్క పరిశ్రమ తేలేకపోయారని అన్నారు. తాను సిఎంగా ఉన్నప్పుడు విశాఖపట్నాన్ని ఐటి హబ్, ఆర్థిక రాజధానిగా తయారుచేయడానికి ప్రణాళిక తయారుచేశానన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానన్నారు. ఇంటింటికీ కుళాయి నీరు ఇప్పిస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత పట్టణంలో రోడ్‌షో నిర్వహించారు. వేలాది మంది టిడిపి కార్యకర్తలు హాజరయ్యారు.

సంక్షేమంలో వాలంటీర్ల పాత్రే కీలకం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వ పథకాలను అందించడంలో వాలంటీర్ వ్యవస్థ కీలకపాత్ర వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. శుక్రవారం నగరంలోని విఎంఆర్‌డిఏ చిల్డ్రన్ ఎరీనాలో ఉత్తమ సేవలందించిన గ్రామ, వార్డు సచివాలయాల వాలంటీర్ల సత్కార సభను ఘనంగా నిర్వహించారు. గ్రామ, వార్డు వాలంటీర్లను సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామ, వార్డుల్లో లబ్ధిదారులను గుర్తించడానికి చాలా రోజులు పట్టేదని, నేడు వాలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులను గుర్తించడం చాలా సులువు అవుతోందని తెలిపారు. కోవిడ్ కష్టకాలంలో సర్వేలు నిర్వహించడంలో, రోగులను ఆసుపత్రిలో చేర్పించడంలో వాలంటీర్లు గణనీయమైన సేవలు అందించారని అన్నారు. వాలంటీర్ పదానికి అర్థం చేకూరేలా విధులు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో గల 607 గ్రామ, వార్డు సచివాలయాల్లోని 9422 మందికి సేవా మిత్ర, 107 మందికి సేవ రత్న, 31 మందికి సేవా వజ్ర, మొత్తం 9560 మందికి ఉగాది పురస్కారాలు అందించి సత్కరించేందుకు జిల్లా కమిటీ ఎంపిక చేసినట్లు తెలిపారు.

'దయాల్‌బాగ్'తో యువతకు ఉపాధి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇప్పటి వరకు మహిళలకు పలు వృత్తి విద్యా కోర్సులు అందిస్తూ ఉపాధి బాటలో నడిపిస్తున్న విశాలాక్షినగర్‌లో దయాల్‌బాగ్ విద్యా కేంద్రం ఇప్పుడు యువతకు కూడా వివిధ రకాల ఉద్యోగ, ఉపాధి కోర్సులు అందిస్తోంది. అందులో భాగంగా యమహా ద్విచక్ర వాహన కంపెనీతో అవగాహన ఒప్పందం చేసుకొని ఒక ఏడాది వ్యవధి గల డిప్లమో ఇన్ టూ వీలర్ మెకానిక్ కోర్సు నిర్వహిస్తున్నారు. పలువురు యువకులు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. శిక్షణ అనంతరం వారికి ధ్రువపత్రాలు అందించనున్నారు.

ప్రత్యేకంగా మెకానిక్ షెడ్ ఏర్పాటు..

ఈ కోర్సులో చేరే విద్యార్థులకు ప్రాక్టికల్స్ నేర్పేందుకు ప్రత్యేకంగా అన్ని వసతులు ఉన్న ఒక మెకానికల్ షెడ్డును నిర్మించారు. విద్యార్థులు నేర్చుకునేందుకు అన్ని రకాల మౌలిక వసతులు, పరికరాలు సమకూర్చారు. ఈ కోర్సులో భాగంగా ఒక రోజు థియరీ, మరుచటి రోజు ప్రాక్టికల్స్ ఉంటాయి. మధ్య మధ్యలో యమహా కంపెనీ నుంచి వచ్చిన ప్రతినిధులు, ఇంజినీర్లు విద్యార్థులకు స్వయంగా మెళకువలు నేర్పిస్తారు. కోర్సులో భాగంగా ప్రతి మూడు నెలలకూ 45 రోజుల పాటు యమహా షోరూమ్‌కు తీసుకెళ్లి అక్కడి పనితీరును చూపిస్తారు. శిక్షణ అనంతరం యమహా ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీలో ట్రైనీలుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు.

ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతోనే..

నిరుపేద యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతోనే దయాల్‌బాగ్ విద్యా కేంద్రం యమహా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే శిక్షణ ప్రారంభించాం. ఇక్కడ నేర్చుకున్న వారిలో ప్రతిభ చూపిన అందరికీ ఉద్యోగం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అందుకే శిక్షణ కూడా బాగా ఇస్తున్నాం. ఇక్కడ కోర్సు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు వస్తాయనే నమ్మకంతోనే యమహా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నాం.

దక్షిణామూర్తి,
కోర్సుల సమన్వయకర్త

మెకానిక్ షెడ్ ఏర్పాటుకు ధైర్యం

నేను ఇంటర్ వరకు చదివాను. ఖాళీగా ఉండడంతో మా అన్నయ్య దయాల్‌బాగ్ విద్యా సంస్థలో ద్విచక్ర వాహన కోర్సులో చేర్పించారు. ఇక్కడ చేరిన మొదటి రోజు నుంచే అధ్యాపకులు ఇస్తున్న శిక్షణ పట్ల చాలా ఆశక్తి ఏర్పడింది. బాగా నేర్చుకుంటున్నాను. నాకు చిన్నప్పటి నుంచి మెకానిక్ వైపు ఆసక్తి ఎక్కువ. అందుకే ఇష్టంగా నేర్చుకుంటున్నాను. కోర్సు పూర్తి కాగానే యమహా కంపెనీలో ఉద్యోగం సంపాదిస్తాననే నమ్మకం కలిగింది. ఇక్కడ నేర్చుకున్న దాన్ని ఇంటి వద్ద ఉన్న పాత ద్విచక్రవాహనంపై సాధన చేస్తున్నాను. ఈ శిక్షణతో భవిష్యత్‌లో మెకానిక్ షాపు పెట్టాలనే ఆలోచన, ధైర్యం వచ్చింది.

ఎస్.కుమార్,
విశాలాక్షినగర్

శిక్షణ బాగుంది

నేను పదోతరగతి చదువుకున్నాను. ఆర్థిక పరిస్థితుల కారణంగా పైచదువులు చదవలేకపోయాను. దయాల్‌బాగ్ విద్యా కేంద్రంలో ఈ కోర్సు గురించి తెలుసుకొని చేరాను. శిక్షణ బాగా ఇస్తున్నారు. భవిష్యత్‌లో మా ప్రాంతంలో గ్యారేజీ ఏర్పాటు చేసుకుంటాను. మరి కొంతమందికి ఉపాధి కల్పించాలనుకుంటున్నాను.

జి.కన్నప్ప,
జాలారిపేట

నేరాలు ఘోరాలు

మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు పరిధి నరవ శివారు ప్రాంతమైన నల్ల క్వారీలులో గురువారం గల్లంతైన పాలిటెక్నిక్ విద్యార్థులు రాకేష్, నిఖిల్ మృతదేహాలు లభ్యమయ్యాయి. గజ ఈతగాలతో పోలీసులు గాలింపు చేపట్టగా గురువారం రాత్రి ఒకరిది, శుక్రవారం మరొకరిది మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు పోలీసులు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ క్వారీ చుట్టూ కంచె ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.



వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

వీధి దీపాల మరమ్మతులకు వినతి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పెదగదిలి, ఈశ్వర్‌దేవీనగర్, సాలిపేట, బాలమురళీనగర్ ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగలేదని, సరిచేయాలని కోరుతూ 31వ సచివాలయ అధికారి భాస్కర్‌కు వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యాన స్థానిక సంఘాల నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వీధి దీపాలు వెలగలేదని ఎన్ని మార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసినవారిలో టిడిపి నాయకులు ఒమ్మి పోలారావు, వానపల్లి గణేష్, దువ్వి తాతారావు, గాడి సత్యం, నమ్మి గణేష్, స్థానిక సంఘాల నాయకులు పైల జగదీష్, వానపల్లి గణేష్ తదితరులు ఉన్నారు.

ఆలయ భూముల క్రయ విక్రయాలు జరిపితే చర్యలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : దేవాదాయ శాఖకు చెందిన భూములు, తమ శాఖ అనుమతి లేకుండా ఎవరైనా క్రయ విక్రయాలు జరిపితే దేవాదాయ శాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పద్మనాభం మండలం పాండ్రంగి శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఎస్.నానాజీబాబు శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం భీమిలి మండలం నారాయణరాజుపేటలో గల వివిధ సర్వే నంబర్లలో 122 ఎకరాల భూమి పాండ్రంగి శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందినదని పేర్కొన్నారు. సంబంధిత భూములపై ఏ విధమైన లావాదేవీలు చెల్లవని స్పష్టం చేశారు.

ఎయు సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : ఆంధ్రా యూనివర్సిటీ 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల చైర్మన్ బి.నరసింగరావు, ప్రిన్సిపల్ సతీష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ చిట్టిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పి.సునీత 9.43 మార్కులతో ప్రథమ శ్రేణిలో నిలవగా, ఉషశ్రీ 9.37 మార్కులతో ద్వితీయ శ్రేణిలో నిలిచినట్లు పేర్కొన్నారు. 9 పాయింట్లకు పైగా 12 మంది, 8 పాయింట్లకు పైగా 62 మంది సాధించారని తెలిపారు. కళాశాలలో 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. బికామ్‌లో 39 మందికి 37 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

డీ సెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రాథమిక విద్యలో ఉపాధ్యాయ వృత్తికి అవసరమయ్యే డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశం కోసం ఎపి పాఠశాల విద్యా శాఖ డీసెట్ -2023 నోటిఫికేషన్‌ను జారీ చేసిందని స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు శుక్రవారం తెలిపారు. ఈ నెల 11 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 12, 13 తేదీల్లో ప్రవేశ పరీక్ష జరగనుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఫీజు తదితర వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం cse.ap.gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ముగిసిన ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రైవేట్ పాఠశాల సమావేశ మందిరంలో 2018 డిఎస్‌సి ఉపాధ్యాయులకు ఈ నెల 15న ప్రారంభమైన వృత్యంతర శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. సోషల్, హిందీలో ఎన్నో కొత్త విషయాలు ఈ శిక్షణా తరగతుల ద్వారా నేర్చుకున్నట్లు శిక్షణా తరగతులకు హాజరైన పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయ పడ్డారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించిన ఎన్.సంపత్ కృష్ణ, టిఎస్‌వి.ప్రసాదరావు, ఎంవివిఎన్. బలరామమూర్తి, సతీష్, సుధాకర్, బి.మధుమతి, ఝాన్సీ తదితరులను సత్కరించారు.

వ్యర్థాల తొలగింపులో అలసత్వం వద్దు



జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ

ప్రజాశక్తి -పిఎం.పాలెం : చెత్త పోగులు తొలగింపులో అలసత్వం ప్రదర్శించరాదని శానిటేషన్ అధికారులను జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ ఆదేశించారు. శుక్రవారం ఆయన జోన్ -2లోని 5, 7 వార్డుల పరిధి శ్యామ్‌నగర్ కాలనీ, స్వతంత్రనగర్, మల్లయ్యపాలెం, ఆర్‌టిసి కాలనీ తదితర ప్రాంతాలలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వార్డులో అధికంగా చెత్తపోగులు కనిపిస్తున్నాయని, రోడ్లు స్వీపింగ్ సరిగా చేయడం లేదని, వెంటనే చేత్తపోగులు ఎత్తించి రోడ్లను శుభ్రపరచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. శ్యామ్‌నగర్ కాలనీ బాలుర వసతి గృహం వద్ద అధికంగా వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయని అసహనం వ్యక్తం చేస్తూ వెంటనే తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు ఉదయం 6 గంటల నుండి విధుల్లో ఉండాలని, పిన్ పాయింట్ వారిగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేసి, ఎవ్వరికి నిర్దేశించిన పనులను వారిచే చేయించాలని ఆదేశించారు. ప్రధానంగా కాలువలు, గెడ్డలపై ప్రత్యేక శ్రద్ధ వహించి శుభ్రపరచాలన్నారు. నిర్ణీత సమయానికే క్లాప్ వాహనాలు పాయింట్‌లలో ఉండాలని, వాహనాలు డైరీ తప్పనిసరిగా రాయాలని చెప్పారు. వార్డులలో పందులు అధికంగా కనిపిస్తున్నాయని, వాటిని నిర్మూలించాలని ఆదేశించారు. ఫ్రైడే -డ్రైడే సందర్భంగా దోమలు వృద్ధిని అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం సీతకొండ వద్ద వైఎస్‌ఆర్ వ్యూ పాయింట్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణ రాజు, పట్టణ ప్రణాళికా అధికారి బి.సురేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్ రాజు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేకుండానే దుష్ప్రచారం

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పెదబాబు

ప్రజాశక్తి -తగరపువలస : ఎటువంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేని కొందరు రైతులు ఉద్దేశపూర్వకంగానే తన పైనా, తమ కుటుంబ సభ్యులపైనా దుష్ప్రచారం చేస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డి.పెదబాబు ఆరోపించారు. భీమిలి మండలం మజ్జివలసలోని అతని నివాసం వద్ద పలువురు వైసిపి నాయకులతో కలిసి శుక్ర వారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1973లో ఎపి భూసంస్కరణల చట్టం (ల్యాండ్ సీలింగ్ యాక్ట్) ప్రకారం సింగనబంద గ్రామంలో తమ భూములనే అప్పటి ప్రభుత్వానికి అప్పగించామని వివరించారు. తమ పూర్వీకుల నుంచి తమకు సంక్రమించిన ఆస్తులపై రైతులు రిజిస్టర్ డాక్యుమెంట్ల ద్వారా హక్కులు పొంది ఉంటే, ఇనాం సెటిల్ మెంట్ అధికారి సమక్షంలో ఆయా రైతుల పేర్లు సంబంధిత రికార్డులో నమోదు చేయుటకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. ఇనాం భూ సాగుదారులతో చర్చలకు తాను, తమ కుటుంబ సభ్యులు ఎప్పుడైనా సిద్ధమేనని చెప్పారు. ఎంపిపి వాసురాజు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు మాట్లాడుతూ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా ఉన్న పెదబాబు, అతని కుటుంబ సభ్యులపై రాజకీయ దురుద్దేశంతో కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇనాం వాటా దారులకు, కొంత మంది సాగుదారులైన రైతులకు మధ్య ఎంతోకాలంగా ఉన్న చిన్న పాటి విభేదాలతో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు గానీ, వైసిపికి గానీ సంబంధమే లేదని స్పష్టం చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, దాకమర్రి, నారాయణ రాజుపేట, మజ్జిపేట సర్పంచులు చెల్లూరి పైడప్పడు, కాద సూర్యనారాయణ, మజ్జి సూరినాయుడు, ఎంపిటిసి సభ్యులు మజ్జి శ్రీనివాసరావు, చెల్లూరి నగేష్‌బాబు, సింగనబంద ఉప సర్పంచ్ ఎంవి.రమణ, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, పార్టీ నాయకులు పొట్నూరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పెదబాబు

చంద్రబాబు వ్యాఖ్యలపై వైసిపి నిరసన

ప్రజాశక్తి -యంత్రాంగం : 'ఈ ప్రభుత్వం ఇస్తున్న సెంటు భూమి శవం పూడ్చడానికి సరి పోతుందంటూ' చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలపై వైసిపి నాయకులు శుక్రవారం నిరసనలు తెలిపారు.

భీమునిపట్నం : అమరావతిలో సుమారు 50 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టడమే కాకుండా "మీకు ఇస్తున్న సెంటు భూమి శవం పూడ్చడానికి సరి పోతుందంటూ" బలహీన వర్గాలను కించ పరిచేలా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా గంట స్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. పేదల పట్ల టిడిపి నేత చంద్రబాబుకు చులకన భావం ఉన్నట్లు ఇట్టే అర్థమవుతుందని జివిఎంసి 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, 3వ వార్డు వైసిపి అధ్యక్షులు అల్లిపిల్లి నరసింగరావు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జివి రమణ, పార్టీ నాయకులు సిహెచ్.భాస్కరరెడ్డి, కోండ్రు రామ సూరప్పుడు, జీరు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

పిఎం పాలెం : టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విశాఖ పర్యటనలో భాగంగా సెంటు భూమి దేనికి సరిపోతుందంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ భీమిలి నియోజకవర్గం జోన్- 2 పరిధి 5, 6, 7 వార్డుల వైసిపి నాయకులు కొమ్మాది కూడలి వద్ద ఉన్న వైసిపి విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తమ నాయకుడును అవహేళన చేస్తూ విశాఖ సభలో చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 5, 6, 7 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్టా అప్పలరాజు, పోతిన శ్రీనివాసు, కుడితి రామారావు, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, పోతిన సురేష్, పిల్లా రమణ, గుంటుబోయిన సంజీవ్, సియాద్రి కనకరాజు, కురిటి లోహిత్ జెఎస్ రెడ్డి పాల్గొన్నారు.

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన ఊర్వశి జంక్షన్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ, ఇళ్లు లేని పేదలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సొంతిల్లు కల్పిస్తుంటే ఓర్వలేని చంద్రబాబు లేనిపోని వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చంద్రబాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనుక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ బర్కత్ అలి, కార్పొరేటర్లు కె.అనీల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతీశ్రీనివాసరావు, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజనీఈశ్వరరావు, కెవిఎన్ శశికళ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు కె.వెంగళరావు, బులుసు జగదీష్, పోతు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలో నిరసన ర్యాలీలో 4వ వార్డు కార్పొరేటర్ కొండబాబు తదితరులు



ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న జివిఎంసి సిబ్బంది

ఫుట్‌పాత్ ఆక్రమణపై స్పెషల్‌డ్రైవ్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఏసీపీ వెంకటేశ్వర్లు ఆదేశాలు మేరకు సీతమ్మధార రైతు బజార్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసుల సహకారంతో పట్టణ ప్రణాళిక అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జోన్ -3 పరిధిలోని సీతమ్మపేట, గురుద్వార్, సీతమ్మధార, హెచ్‌బి.కాలనీ, మద్దిలపాలెం ప్రాంతాల్లో పోస్టర్లను తొలగించినట్లు టీపీఎస్ తేజ తెలిపారు. ఎవరైనా కొత్తగా పోస్టర్లు అతికిస్తే అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు.

22న ఐసిఐసిఐ బ్యాంక్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -గాజువాక : విడిఎ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు ఐసిఐసిఐ బ్యాంక్‌లో పలు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ కె.సీతామహాలక్ష్మి తెలిపారు. డిగ్రీ చదివిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న భాగ్యలక్ష్మి, సత్యరాజు

నాట్యంలో శిక్షణ

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం ప్రకాష్‌నగర్‌లోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో శుక్రవారం చిన్నారులకు నాట్యంలో శిక్షణ ఇచ్చారు. వివిధ సినీ గీతాలకు, జానపద గేయాలకు జాతీయ సేవా పథకం వాలంటీర్లు అలేఖ్య, లావణ్య నాట్య శిక్షణ ఇచ్చారు. చిన్నారులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. 12 ఏళ్ల లోపు చిన్నారులకు ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. విజేతలకు ప్రముఖ కవి కె.సత్తిరాజు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులతోపాటు కార్మిక నాయకులు బి.సత్యానందం, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు ఇపిఎస్.భాగ్యలక్ష్మి, అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు వివిధ పుస్తకాలను అధ్యయనం చేశారు.

రెండో రోజూ అప్పన హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో భక్తులు హుండీలు ద్వారా సమర్పించిన కానుకలను రెండో రోజూ లెక్కింపు కొనసాగించారు. రెండో రోజు లెక్కింపులో రూ.1,15,55,513 నగదు, 94 గ్రాముల 510 గ్రాముల బంగారం, 9 కేజీల 135 గ్రాముల వెండి, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు లభించినట్లు దేవస్థానం ఈఓ బి త్రినాధరావు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానానికి చెందిన విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

శానిటరీ ఇన్‌స్పెక్టర్ దూకుడుపై...

పారిశుధ్య కార్మికుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ పరిధి 67వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నమ్మి శివప్రసాద్ చూపిన దూకుడును నిరసిస్తూ పారిశుధ్య కార్మికులు శుక్రవారం మాస్టర్ పాయింట్ వద్ద గంట పాటు విధులు బహిష్కరించారు. 'క్లాప్ వాహనాల వద్ద నిరంతరమూ ఒక్కరే కొనసాగాలని, నేను చెప్పిన పని చేయడం ఇష్టం లేనివారు మీ దిక్కున చోటకు వెళ్లి చెప్పుకొండి' అంటూ దురుసుగా వ్యవహరించారని కార్మికులు చెబుతున్నారు 365 రోజులు ఒక్కరే కంటిన్యూగా పనిచేయగలమా అని బ్రతిమిలాడినా సరే పట్టించుకోకుండా భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు.

విషయం తెలుసుకున్న ఎఎంఒహెచ్ కిరణ్‌కుమార్ వెళ్లి పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. వారానికి ఒక బ్యాచ్ మారుతూ రోటేషన్‌పై క్లాప్ వెహికల్స్ వద్ద తడి - పొడి చెత్త సేకరణకు కార్మికులను ఒప్పించారు. అనంతరం కార్మికులు వారివారి పనుల్లోకి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, దారకొండ, కనక, సింహాచలం, రామకృష్ణ, రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నరసింహపాత్రుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -గాజువాక: జివిఎంసి 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు జన్మదిన వేడుకలు దయాల్ నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరయ్యారు. వారి సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం గజమాలతో నరసింహపాత్రుడును అందరూ కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్‌బాబు, తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, రాజకీయాల్లో నిబద్ధత, సేవాభావం, పట్టుదల కలిగిన నేతలు అరుదుగా ఉంటారని అటువంటి వారిలో నరసింహ పాత్రుడు ఒకరని కొనియాడారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో ప్రజల హృదయాలను గెలుచుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్, గాజువాక వైసిపి ఇంచార్జి తిప్పల దేవన్‌రెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ పల్లా చినతల్లి, ఇంటక్ నేత మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, ఉరుకూటి చందు, రాజాన రామారావు, మహ్మద్ ఇమ్రాన్, సన్నీ, పూర్ణానంద శర్మ, రాజాన వెంకటరావు, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ పార్క్ అభివృద్ధి

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడ సిడబ్ల్యూసికి ఆనుకున్న ఉన్న ఖాళీ స్థలంలో చిల్డ్రన్ పార్క్ అభివృద్ధి కోసం శుక్రవారం పాలకవర్గం చదునుచేయించింది. తమ సొంత నిధులతో చిన్నపిల్లల కోసం పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు పాలకవర్గ సభ్యులు, ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ అనిపెద్ది మషన్‌రావు, సిడబ్ల్యుసి ప్రెసిడెంట్ నమ్మి సత్యనారాయణ, సెక్రటరీ ఉరుకుట రమణయ్య, ట్రెజరర్ నందికి చిన్నారావు, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రెసిడెంట్ నందికి తాతారావు తెలిపారు.


పార్కు అభివృద్ధికి చదును చేయిస్తున్న సిడబ్ల్యుసి పాలకవర్గం



కీర్తి పట్నాయక్‌కు జీవవైవిధ్య సంరక్షణ పురస్కారం

ప్రజాశక్తి-మాధవధార : మురళీనగర్‌కు చెందిన శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు అధినేత్రి డాక్టర్ కుప్పిలి కీర్తిపట్నాయక్ జీవవైవిధ్య సంరక్షణ రాష్ట్ర పురస్కారానికి ఎంపికయ్యారు. గుంటూరుకు చెందిన జీవవైవిధ్య మండలి ఆధ్వర్యాన ఈ నెల 22న తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీలో ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. 20 సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఈ పురస్కారం అందిస్తున్నారు. ఈ పురస్కారం ద్వారా తనపై మరింత బాధ్యత పెరిగిందని ఈ సందర్భంగా కీర్తిపట్నాయక్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి- అడ్డతీగల : గంగవరం మండలం జడేరు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగవరం మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన పల్లాల గోపాల్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనాస్థలిలో ఉన్న వ్యక్తులు నుంచి సమాచారం అందుకున్న 108 వాహనసిబ్బంది చేరుకుని, తలకు గాయమైన గోపాలరెడ్డికి ప్రథమ చికిత్స చేసి, అనంతరం రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌కు తరలించినట్లు ఇఎంటి రామకృష్ణ, పైలెట్ నవాజ్ తెలిపారు. దీనిపై పోలీసులకు సమాచారం తెలిపినట్లుగా గ్రామస్తులు తెలిపారు

'ఉపాధి' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

- పని ప్రదేశంలో సౌకర్యాలు కరువు
- గిట్టుబాటు కాని కూలి డబ్బులు
- వేసవి అలవెన్స్, పనిముట్లకు ఎసరు

ప్రజాశక్తి- కె.కోటపాడు : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, ఉపాధి కూలీలను పొమ్మనుకుండా పనిని కష్టం చేసి, పొగ పెట్టేలా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి కూలీలు పనిచేసే చోట కనీస సౌకర్యాలు లేకుండా చేస్తూ, వారిని ఇబ్బంది పాల్జేస్తోంది. మండలంలోని చౌడువాడ పంచాయతీ శివారు పాచిలువానిపాలెం గ్రామంలో కృష్ణసాగర చెరువు వద్ద ఉపాధి పని ప్రదేశానికి వెళ్లిన ప్రజాశక్తి ప్రతినిధికి ఉపాధి కూలీలు తమ సమస్యలు, ఇబ్బందులు ఏ కరువు పెట్టారు.
నాలుగేళ్లుగా ఉపాధి పనులు చేసే కూలీలకు గునపాం, పార వంటి పరికరాలను ఇవ్వడం లేదని వాపోయారు. పని ప్రదేశంలో నీడకోసంగతంలో ఇచ్చిన టార్పాలిన్లు కూడా పత్తా లేదని, దీంతో మండుటెండల్లో పనిచేసిన కూలీలు కాస్తా సేదదీరేందుకైనా పనిప్రదేశంలో నీడ లేనిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స మందుల కిట్ ఒకపుడు ఉండేవని, ఇపుడా పరిస్థితి లేదని అంటున్నారు. గతంలో వేసవి సీజన్‌లో ఉపాధి పనిచేసేవారికి వేసవి అలవెన్స్‌గా కూలీ డబ్బులలో 50శాతం మొత్తాన్ని అదనంగా చెల్లించే పరిస్థితికి పూర్తిగా మంగళం పాడేశారని కూలీలు వాపోతున్నారు.
పేమెంటు ఇచ్చే ముందు పేసిప్పులు ఇచ్చేవారని, దాని ద్వారా ఆ వారంలో చేసిన పనికి ఎవరికి ఎంత వస్తుందో తెలిసే పరిస్థితి ఉండేదని, ఇపుడు దాన్ని లేకుండా చేసేశారని అంటున్నారు ఉదయంఆరు గంటల నుంచి 10:30 గంటల వరకు పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన కొలతలు రాకపోవడంతో, రెండు పూటలా పనిచేయాలని ఒత్తిడి చేస్తున్నారని, లేదంటే వారంలో ఒక్కరోజైనా సెలవనేది లేకుండా ఆదివారం కూడా పనిచేయిస్తున్నారని ఉపాధి కూలీలు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన కొలతలతో పాటు ఐదు గంటలు పని చేసినట్లయితే ప్రతి ఒక్కరికి రూ.272 రావాల్సి ఉన్నా, తక్కువ డబ్బులే ఇస్తున్నారనానరు. గతంలో ఒక్కొక్క గ్రూపులో 20 మంది కూలీలుండే, గతేడాది నుంచి వాటి యొక్క 50కి పెంచారని, దీంతో మేట్లకు పని భారం పెరిగిందని మేట్లు వాపోయారు. పనిభారం పెరిగినా, పైనా ఆదాయం పెంచలేదని , సరికదా, ఇపుడు స్మార్ట్ ఫోన్లు కొనుగోలుకు సుమారు రూ.15వేలు, ప్రతినెలా రీఛార్జికి రూ.350 పెట్టడం ద్వారా ఆర్థికభారం పెంచారని, దీనికి ప్రభుత్వం నుంచి ఒక్కపైసా కూడా ఇవ్వలేదని మేట్లు వాపోతున్నారు.



పాచిలువానిపాలెంలో చెరువు వద్ద ఉపాధి పనిచేస్తున్న కూలీలు

కష్టానికి తగ్గ కూలి దొరకడం లేదు



ఎండలు తీవ్రంగా ఎక్కువగా ఉన్నందున పనిచేయుటకు చాలా ఇబ్బందికరంగా ఉంది. అధికారులు ఇచ్చిన కొలతల మేరకు పనికి చేయకపోతే డబ్బులు తగ్గిస్తామని చెప్తున్నారు. పాత పద్ధతిలోనే పనులు చేయించి, వేతనం చెల్లించడంతోపాటు పనిప్రదేశంలో అవసరమైన సౌకర్యాలను కల్పించాలి.
బండారు సన్యాసమ్మ, ఉపాధి కూలీ, చౌడువాడ శివారు పాచినవానిపాలెం.

23న జాబ్‌మేళా

ప్రజాశక్తి-చోడవరం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా రేబాక,గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 23న మిని జాబ్‌మేళా నిర్వహిస్తునట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి టి. చాముండేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో నాలుగు కంపెనీలో పాల్గొంటున్నాయని, పదవ తరగతి నుండి పిజి వరకు చదువుకొని 18-35 ఏళ్ల లోపు ఆసక్తి ఉన్న యువతీ, యువకులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని సూచించారు. మరిన్ని వివరాలకు 70133 42667, 703633272 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టండి


నిరసన తెలుపుతున్న సిద్ధార్థ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ఆర్‌డిఒకార్యాలయం వద్ద శుక్రవారం సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్ల నాగభూషణం మాట్లాడుతూ ఈ ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాలు, వివిధ రకాల నేరాల వలన జిల్లా ప్రజలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత పట్టణంలో జనాభా, ట్రాఫిక్ పెరిగిందని, దానికి అనుగుణంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు వినకోట నీలేశ్ గుప్తా, సహాయ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పట్నాల కృష్ణ మోహన్, రొబ్బి మల్లేశ్వర రావు, జిల్లా బుద్దిస్ట్ సొసైటీ అధ్యక్షులు నేలపూడి బాలరాజు పాల్గొన్నారు.

సేవారత్న లోకేశ్వరికి సత్కారం


వాలంటీర్ లోకేశ్వరిని అభినందిస్తున్న సర్పంచ్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల మేజర్ పంచాయతీ వాలంటీర్ మామిడి లోకేశ్వరి సేవా రత్న అవార్డు అందుకున్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రవి పటాన్‌శెట్టి నుంచి అవార్డు అందుకున్న లోకేశ్వరిని తుమ్మపాల గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ఆధ్వర్యంలో సన్మానించారు ఇఒ శ్రీనివాసరావు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వాలంటీర్లు : ఎంపీ


అవార్డులు అందుకున్న వాలంటీర్లతో ఎంపీ, కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించే సంక్షేమ సారథులు వాలంటీర్లని ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వాలంటీర్లకు వందనం జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టితో కలిసి వాలంటీర్లకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి, వారికి పథకాన్ని అందించే బాధ్యతను వాలంటీర్లు తీసుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏర్పాటుచేసిన వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.
జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ అర్హులను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అంద చెయ్యడంలో ప్రభుత్వ యంత్రాంగానికి వాలంటీర్ వ్యవస్థ మద్దతుగా నిలుస్తున్నారన్నారు. జిల్లాలో 34 మందికి సేవా వజ్ర, 135 మందికి సేవా రత్న, 7800 మందికి సేవా మిత్ర అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విజయవాడలో పాల్గొన్న సభను ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, జెడ్‌పి వైస్‌చైర్మన్ బివి.సత్యవతి, డిఆర్‌ఒ పి. వెంకటరమణ, జిఎస్ఎంఎస్ ప్రత్యేక అధికారి మంజులావాణి, అనకాపల్లి ఎంపిపి గొర్లె సూరిబాబు, జిల్లాలోని వాలంటీర్లు పాల్గొన్నారు

సతీష్‌కు చిరు సత్కారం


సతీష్‌ను సన్మానిస్తున్న కొత్తపల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి- చోడవరం : మండలంలోని ఎం కొత్తపల్లి మరిడిమాంబ అమ్మవారిని వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ శుక్రవారం దర్శించుకున్నారు, గ్రామ ప్రజలు, ముందుగా సతీష్‌ను సాదర స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం సతీష్ బాబును కొత్తపల్లి గ్రామ పెద్దలు దుశ్శాలువా కప్పి చిరు సత్కారం చేశారు. ఎం కొత్తపెల్లి గ్రామస్తులు, ఎంవీఆర్ యువసేన సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు,

ఆలయ గేటు నిర్మాణానికి వితరణ


చెక్ అందజేస్తున్న టిడిపి నేత చిన్నా, తదితరులు


ప్రజాశక్తి -పరవాడ: మండలంలోని రావాడ పంచాయతీ శివారు జల్లేలపాలెం గ్రామంలో మరిడిమాంబ ఆలయ గేటు నిర్మాణానికి వార్డు సభ్యులు కూండ్రపు శ్రీనివాస్ తన సొంత నిధులు రూ.50 వేలను శుక్రవారం మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా ద్వారా చెక్‌ను మరిడిమాంబ ఉత్సవ కమిటీ చైర్మన్ మేడిశెట్టి మాణిక్యానికి గ్రామస్తులు సమక్షంలో అంద జేశారు. కార్యక్రమంలో పితాని అప్పారావు, పితాని శ్రీనివాసరావు, మేడిశెట్టి శ్రీనివాసరావు, పొలవరపు నాగరాజు, మేడిశెట్టి సంతోష్, కాకర రాజు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన


విద్యార్థులతో హెచ్‌ఎం స్వర్ణలత, ఇతర ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ఏ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన జి.షర్మిల, ఎల్.వరలక్ష్మి, జి. హరీష్, బి. జ్యోతి, డి. దాలినాయుడు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై స్వర్ణలత, ఉపాధ్యాయ సిబ్బంది మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. శుక్రవారం పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థులందరికీ మార్కుల జాబితాలు డౌన్‌లోడ్ చేసి అందజేశారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వై. స్వర్ణలత మాట్లాడుతూ గ్రామస్తులకు, తల్లిదండ్రులకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరార.. ప్రభుత్వం ఉచితంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగు, బూట్లు, సాక్షులు బెల్ట్ తో పాటు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్, అమ్మ ఒడి పథకాన్ని కూడా అందిస్తుందని, విద్యార్థులందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పాఠశాలలో చేరాలని అవగాహన కల్పించారు.

చిరుజల్లులతో చల్లబడ్డ వాతావరణం



కారుమబ్బులు కమ్ముకున్న ఆకాశం

ప్రజాశక్తి- దేవరాపల్లి : గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు సంభవించి కారు మబ్బులు కమ్మేయడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి, చల్లని గాలులు వీచాయి. కాస్త కురిసిన చిరుజల్లులకు వాతావరణం చల్లబడడంతో పల్లె ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామాల అభివృద్ధి

ఎస్ఎజివై సమీక్షలో ఎంపీ డాక్టర్ సత్యవతి


సమీక్షలో మాట్లాడుతున్న ఎంపి సత్యవతి, పక్కనే కలెక్టర్ రవిసుభాష్

ప్రజాశక్తి.-అనకాపల్లి : జిల్లాలో ఉన్న ఆదర్శ గ్రామాలు అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చెందే విధంగా అధికారులు కృషి చేయాలని ఎంపీ డాక్టర్ బివి. సత్యవతి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన (ఎస్ఎజివై) పథకంలో జిల్లాలోని ఆదర్శ గ్రామాలలో ఎంపీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్‌తో కలసి సమీక్షించారు. ముందుగా పాయకరావుపేట అబివృద్ధికి చేపట్ట వలసిన కార్యక్రమాలను ఎమ్మెల్యే బాబురావు వివరించారు. గొలుగొండ మండలం ఏఎల్ పురం (కృష్ణదేవి పేట), మునగపాక మండలం గణపర్తి, సబ్బవరం మండలం మొగలిపురం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని, కొత్తగా చేపట్టవలసిన పనులను గూర్చి చర్చించారు. మాడుగుల గ్రామంలో ఇప్పటివరకు పూర్తిచేసిన పనులపై చర్చించారు. కోనాం జలాశయంలో నీరు ఎక్కువగా ఉన్నప్పుడు గిరిజనులు వచ్చేందుకు వీలుగా రహదారి నిర్మాణానికి రూ.40 లక్షల ఖర్చు అవుతుందని ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డి తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ఏమైనా ఆటంకాలు ఏర్పడి నట్లయితే వెంటనే తనదృష్టికి తీసుకురావా లన్నారు. అవసర మైతే నేషనల్ హైవేస్, రైల్వే శాఖలతో ఎంపీ మాట్లాడతారని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యే గ్రాంట్లు, వివిధ శాఖల గ్రాంట్లను సమన్వయపరిచి నిధులు సమకూరుస్తామన్నారు. తరువాత మలేషియాలో జరిగిన కరాటే పోటీలలో బహుమతులు గెలుచుకున్న సబ్బవరం మండలానికి చెందిన సాయి సురేంద్రను ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవిసుభాష్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, జెడ్‌పి సిఇఒ శ్రీరామ్ మూర్తి, సిపిఒ జి రామారావు, డ్వామా పిడి సందీప్, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎ. హేమంత్, డిపిఒ ఆర్ శిరీష రాణి, ఆర్ అండ్ బి ఇఇ రమేష్, పిఆర్ ఇఇ వీరు నాయుడు, ఒఎస్‌డి పోలినాయుడు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పాఠ్యపుస్తకాలు డౌన్‌లోడ్‌పై
విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి-సబ్బవరం: పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాలను 1వ తరగతి నుండి 9వ తరగతి వరకు తరగతి వారీగా పొందుపరచిన ఆన్‌లైన్ లింక్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుంటే వేసవి సెలవులలో విధ్యార్థులు నేర్చుకోవడానికి వీలవుతుందని, దీనిపై విద్యార్థులకు ఉపాధ్యాయులు తగు సూచనలు చేయాలని స్థానిక మండల విద్యా శాఖాధికారి యస్.అప్పలరాజు ఉపాధ్యాయులను కోరారు. శుక్రవారం సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ లింక్ ద్వారా ఏ విధంగా పాఠ్యపుస్తకాలను డౌన్‌లోడ్ చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎంఇఎస్ కోఆర్డినేటర్ ఎం. మహేష్, సిఆర్‌పి రమణ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎపిడి శ్రీనివాస్

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని కొండపాలెం గ్రామం పెద్దిరాజు చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎపిడి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ మస్టర్ షీట్లను పరిశీలించారు. నిబంధనల మేరకు పనులు చేపట్టాలని, అపుడే ప్రభుత్వం నిర్దేశించిన ఉపాధి హామీ వేతనం అమలు అవుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముచ్చకర్ల తాతీలు, ఉపసర్పంచ్ సిహెచ్ నాగేశ్వరరావు, విఆర్‌పి కోనపల్లి వరహాలు, సీనియర్ మేట్ ఎం.అప్పారావు పాల్గొన్నారు.

కుళాయి పనులతో రోడ్లు, డ్రెయినేజీ ధ్వంసం


ఛిద్రమైన డ్రెయినేజీలను పరిశీలిస్తున్న సిపిఐ నేత రాజు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని రైవాడ పంచాయతీలో ఇంటింటి కుళాయి పేరుతో డ్రైనేజీలు రోడ్లు పాడు చేస్తున్నారని సిపిఐ మండల కార్యదర్శి గరికిన రాజు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామంలో డ్రైనేజీలు పరిశీలించారు. ఒక అభివృద్ధి పనిచేస్తే, మరో సమస్య సృష్టించడం సరికాదని, సరైన ముందుచూపుతో అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. కాంట్రాక్టర్లపై పునలు చేపట్టే బాధ్యతను వదిలేస్తే ఇలాగే ఉంటుందని, జలజీవన్ మిషన్ పనుల కోసం పాడౌతున్న డ్రైనేజీలు, రోడ్లను బాగుచేసే చర్యలను సంబంధిత కాంట్రాక్టర్‌తో చేయించేలా అధికారులు బాధ్యత వహించాలని కోరారు. ప్రస్తుతం అడ్డగోలుగా సాగుతున్న పనులతో వర్షాలు పడితే నీరు ఎక్కడికక్కడ నిలిచే పరిస్థితి ఉందన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా వెంటనే పనులు పూర్తి చేయాలని రాజు డిమాండ్ చేశారు


అర్హులకు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గడపగడపకూ ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి- చోడవరం : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించే చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. శుక్రవారం అంకుపాలెం పంచాయతీలో గోవిందమ్మ కాలనీ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి నగదు బదిలీతో పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కుతున్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి గ్రామంలోనూ ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలం, ప్రభుత్వమే నేరుగా ఇల్లు కట్టిస్తుందని తెలిపారు. అంకుపాలెం గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో చాలామంది పేదలకు చోడవరంలో జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైనేజీ సౌకర్యం మెరుగుపరిచి, పారిశుధ్య సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఎంపిపి గాడి కాసు, స్థానిక సర్పంచ్ నాగులపల్లి పద్మావతి రాంబాబు, వైస్ ఎంపిపి బైన కుమారి ఈశ్వరరావు, ఎంపిడిఒ చైతన్య పాల్గొన్నారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పనితీరులో మెరుగు కనపరిచిన వాలంటీర్లకు నగదు బహుమతితో పాటు ఎమ్మెల్యే సత్కారాలు చేశారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే అన్నారు.

పాత పద్ధతిలోనే 'ఉపాధి' కల్పించాలి

పనుల పరిశీలనలో వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు నేతలు


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

ప్రజాశక్తి -అచ్చుతాపురం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు పాత పద్ధతిలో పనులు కల్పించి మంచినీరు, ఓఆర్ఎస్, మజ్జిగ ,పంపిణీ చేయాలని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాముడిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తిమ్మరాజుపేట, ఎర్రవరం గ్రామాల్లో పర్యటించి ఉపాధి పని ప్రదేశాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీవ్ర ఎండల్లో పనులు చేస్తున్న కూలీలకు ఉపాది చట్టంలోని నిబంధనల ప్రకారం తాగునీరు,నీడ, ఇతర సౌకర్యాలు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. గురువారం రావికమతం మండలంలో వడదెబ్బ తగిలి ఒక కూలి మరణించిన విషయాన్ని ప్రభుత్వం, అధికారులు గమనంలో పెట్టుకుని ఇప్పటికైనా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఒకే రకమైన పని చేస్తున్న కూలీలకు వేతనం చెల్లింపుల్లో వ్యత్యాసం, వేసవిఅలవెన్సు, గునపం, పారకు డబ్బులు పాత పద్ధతిలో కొనసాగించాలని, కొలతలుతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన దినసరి కూలీ రూ. 272 ప్రతి ఒక్కరికి ఇవ్వాలని, 200 రోజులు పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చెల్లిబొయిన అప్పారావు ,ధనలక్ష్మి, వరాలమ్మ పాల్గొన్నారు

కె.కోటపాడు : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యానికి కుట్ర చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగళి ముత్యాల నాయుడు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపుమేరకు శుక్రవారం మండలంలోని అనంతపురం. పోతన వలస గ్రామాలలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ. 600 కూలి ఇచ్చి, ఏడాదిలో 200 రోజులు పని దినాలు కల్పించాలని, వేసవి అలవెన్స్ చెల్లించాలని, గునపాం, పార ఇత పనిముట్లు అందించాలని డిమాండ్ చేశారు.


కె.కోటపాడులో ఉపాధి కూలీలతో వ్యకాస నేత ముత్యాలనాయుడు

టిడ్కో ఇళ్ల పంపిణీలో
జాప్యమెందుకో?

ప్రజాశక్తి.-అనకాపల్లి: తెలుగుదేశం ప్రభుత్వం పేద ప్రజల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా లబ్ధిదారులకు ఎందుకు పంపిణీ చేయడం లేదని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పేదల కోసం పనిచేస్తున్నారని, వారికి ఇళ్ల స్థలాలు ఇస్తే చంద్రబాబు అడ్డుకుంటున్నారని మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. అనకాపల్లి వైసిపి నేతలు మరింత దిగజారి, చంద్రబాబు గో బ్యాక్ అంటూ ఆందోళనకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో పేదలు, మధ్య తరగతి, ప్రజల కోసం మూడు క్యాటగిరీలుగా 3,500 టిడ్కో ఇళ్లను సత్యనారాయణపురం వద్ద తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మిస్తే వాటిని ఎందుకు పంపిణీ చేయడం లేదో తమ పార్టీ పెద్దలను ప్రశ్నించాలన్నారు. అధికారులు వైసిపి నాయకులు వాలంటీర్లు ఇంటింటికి తిరిగి పేదలను పీడించుకు తింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వేసవి దుక్కుల ఆవశ్యకతపై అవగాహన

ప్రజాశక్తి- బుచ్చయ్య పేట : కొన్నెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి దుక్కులు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు ఫోన్ లైవ్ ప్రోగ్రాం ద్వారా అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త ఎన్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి దుక్కులు లోతుగా చేపట్టడం ద్వారా ఆరోగ్యపైర్లు ఎదిగి, అధిక దిగుబడులను సాధించవచ్చునన్నారు. ఈ సందర్భంగా పోషకాల లభ్యత , మట్టి నమూనాల సేకరణ, భూసారపరీక్షలపై రైతుల అనుమానాలను నివృతి చేశారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ
అందరి బాధ్యత


మాట్లాడుతున్న తహశీల్దార్ లక్ష్మి

ప్రజాశక్తి- దేవరాపల్లి : ప్రభుత్వ ఆస్తులను, ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని తహశీల్దార్ ఎం, లక్ష్మి అన్నారు శుక్రవారం విలేకరు లతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే తమ దృష్టికి తీసుకు రావాలని, లేకుంటే ఫిర్యాదు చేసినా వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సమగ్ర భూసర్వేలో ప్రభుత్వ భూములను గుర్తించి. వాటిలో సర్వే రాళ్లు వేస్తున్నామని తెలిపారు

ప్రయివేట్ లే అవుట్‌పై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో ఎండపల్లి గ్రామం వద్ద అనధికారిక లే అవుట్‌పై స్థానికులు స్పందనలో చేసిన ఫిర్యాదు, ప్రజాశక్తి దినపత్రిక సహా పలు పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి మండలాన్ని సందర్శించిన సందర్భంలో అక్రమ లేఅవుట్ ల పై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా విచారణ చేపడతామని చెప్పారు. ఇందులో భాగంగా శుక్రవారం నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట జయరాం సదరు లేఅవుట్ పై విచారణ ప్రారంభించారు. లేఅవుట్‌ను పరిశీలించడంతో పాటు పరిసర ప్రాంతాల వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్ ఏర్పాటు చేసిన సర్వే నెంబర్లు, ప్రైవేటు, అనాధీనం, జిరాయితీ భూమి, వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం మండల రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జానకమ్మ, ఈవోపీఆర్‌డి ప్రేమ్ సాగర్, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న ఆర్‌డిఒ



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలోని కర్రి వారి కల్లాలు వద్ద పశు విజ్ఞాన బడి, పశు చికిత్స శిబిరం నిర్వహించారు. వైఎస్ఆర్ పశు వైద్య సంచార వాహనం సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించి గర్భ కోశ వ్యాధులకు చికిత్స, పేడ, రక్త పరీక్షలు నిర్వహించారు. రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడి చిట్టినాయుడు, వైద్యులు లక్ష్మణ్, శైలేంద్ర, సిబ్బంది కిషోర్, సౌజన్య, కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ధరల పెంపు

ప్రజాశక్తి -నాతవరం: వైసిపి పాలనలో బస్, విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర విమర్శించారు. శుక్రవారం నాతవరం మండల పి.కే.గూడెం గ్రామంలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి జనసేన అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టే వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాతవరం మండలంలో జూనియర్ కాలేజ్, గొలుగొండ మండలంలో డిగ్రీ కాలేజ్, నర్సీపట్నంలో పీజీ కాలేజ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల యూత్ అధ్యక్షులు బైన మురళి, పోలుపర్తి సూరిబాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రావికమతం: ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంలో భాగంగా స్వయం ఉపాధికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వెలుగు ఎపిఎం తిలక్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2023- 24 ఆర్థిక సంవత్సరానికిగాను ఈ పథకం కింద రూ.10 లక్షల నుంచి 50 లక్షల వరకు ఖర్చు కాగల వ్యాపార, సేవా రంగ యూనిట్లు స్థాపనకు రుణ సహాయం బ్యాంకుల నుంచి మంజూరు చేయనున్నారని ఆయన తెలిపారు. 18 సంవత్సరాల వయసు నిండిన వారు దరఖాస్తుకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే వారు ప్రాజెక్ట్ కు సంబంధించి అనుభవం, ప్రాజెక్ట్ రిపోర్ట్, ఆధార్ కార్డు తదితర వివరాలు సమర్పించాల్సి ఉందన్నారు. ఇతర వివరాలకు కార్యాలయ పని దినాల్లో మండల వెలుగు కార్యాలయం లో తనను సంప్రదించాలని ఆయన తెలిపారు. శ్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజ్, సిఐఎఫ్ తదితర రుణాలను డ్వాక్రా సంఘ సభ్యులకు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ ఆసరా, తోడు, అభయ హస్తం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సంఘ ప్రతినిధులు

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లిలో శుక్రవారం వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి దృష్టిలో పెట్టుకొని వాహనదారులకు, పాద చారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో సంఘ ప్రతినిధులు నున్న నరసింహమూర్తి, సంతోష్, నాగేశ్వరరావు, కక్కిరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రం ఆర్ అండ్‌బి రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్నామని మండల సర్వేయర్ ఆర్.సత్యనారాయణ, ఆర్ఎంబి జేఈ సాయి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ సత్యనారాయణ మాట్లాడుతూ, బ్రిటిష్ కాలం నాటి సరిహద్దుల ప్రకారం మండల కేంద్రంలో భీమిలి నుంచి నర్సీపట్నం వరకు రోడ్ అక్రమాలు తొలగించడం జరుగుతుందన్నారు.. మార్కింగ్ ఇచ్చిన ప్రదేశం నుంచి ఆక్రమణలను ఆక్రమణదారుడు స్వతహాగా తొలగించుకోవాలని సూచించారు. లేకుంటే సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణలో తొలగించడం జరుగు తుందని హెచ్చరించారు. రోడ్డుకు ఇరువైపులా 60 నుంచి 100అడుగులు ఆక్రమణలు ఉన్నట్లుగా గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, రెవిన్యూ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మార్కింగ్ ఇస్తున్న సిబ్బంది

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి



విచారిస్తున్న అంబుడ్స్‌మెన్

ప్రజాశక్తి-నక్కపల్లి: ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలని అంబుడ్స్‌మెన్ చిన్నయ్యదొర అన్నారు. ఉపాధి కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సోషల్ ఆడిట్‌లో వచ్చిన అభియోగాలపై విచారణ చేపట్టారు. గ్రామాల్లో గుర్తించిన పనులను ఉపాధి హామీ పథకం ద్వారా పక్కాగా నిర్వహించాలని సూచించారు. లక్ష్యం మేరకు కూలీలకు పనులు కల్పించాలని, కనీస వేతనం వచ్చే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, ఏపీఓ ఈశ్వరరావు, ఈసీ టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు,వీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యపై వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి: రాజయ్యపేటలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉపమాక సబ్ స్టేషన్ వద్ద ఏఈ కృష్ణకు గ్రామ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సంవత్సర కాలంగా లో వోల్టేజ్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లో వోల్టేజ్ కారణంగా లైట్లు, ఫ్యాన్లు, గ్రైండర్, మిక్సీలు పని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యుత్ వైర్లు కూడా కిందకు వేలాడుతున్నాయని దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.15 రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పిక్కి శ్రీనివాసరావు, కోదండరావు, గంగరాజు, సత్తిబాబు, కాశీరావు, బాబుజి పాల్గొన్నారు .



ఏఈకు వినతి పత్రం ఇస్తున్న వెంకటేష్

వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లో శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ దమయంతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న సిహెచ్ భవానీ టీచర్ పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ కనకరాజు మాట్లాడుతూ, కుటుంబం, పరిసరాలపై వివరించారు.



కోటవురట్లలో చదువుతున్న పిల్లలు

గొలుగొండ :వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గొలుగొండ గ్రంథాలయంలో విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజబాబు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ పై అవగాహన కల్పించారు. ఇంగ్లీష్ పదాలకు తెలుగు అర్థాలను వివరించారు.

కోటవురట్ల: శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు చిన్నారులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. చిన్నారులు పుస్తకాలను చదువుకున్నారు.

మునగపాక రూరల్: వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం ఉపాధ్యాయులు శివకోటి దుర్గాప్రసాద్ విద్యార్థులకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర ముఖ్య ఘట్టాలపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. పుస్తక పఠనం యొక్క ప్రాధాన్యత, పొడుపు కథలు, పాటల పాడడంపై శిక్షణనిచ్చారు. గ్రంథాలయాధికారి ఎల్‌వి.రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తిమ్మరాజుపేట హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు వెంకట అప్పారావు, ఉపాధ్యాయిని ఆశాదేవి పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక సబ్బవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లైబ్రేరియన్ వి శిరీష పర్యవేక్షణలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడంపై శిక్షణ ఇచ్చారు.

వడదెబ్బకు తాపీ మేస్త్రి మృతి



ప్రజాశక్తి - మాడుగుల: వడదెబ్బ కారణంగా అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామానికి చెందిన చొడే అప్పారావు మృతిచెందారు. ఆయన గురువారం ఉదయం తాపీ పని కోసం వెళ్లి మధ్యాహ్నం మండుటెండలో తిరిగి ఇంటికి వచ్చారు. వడదెబ్బకు గురై వెంటనే మృతిచెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, గ్రామ నేతలు రాజేష్, మూర్తి, పడాల అప్పలనాయుడు, అప్పలరాజు పరామర్శించారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో కే.వెంకటాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో చంద్రశేఖర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు ఆయన మజ్జిగ సరఫరా చేశారు. ఉపాధి కూలీలకు అందుతున్న వేతనాలను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ఉదయం 6గం నుంచి పని మొదలు పెట్టి 10:30లోపల ముగించాలన్నారు.ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ భాగ్యలక్ష్మి, వైసిపి నాయకులు నాని, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అటవీ సిబ్బంది

ప్లాస్టిక్ అనర్థాలపై ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని కాపాడాలని కృష్ణదేవిపేట అటవీ రేంజ్ డిఆర్వో రాజేష్ కోరారు. కృష్ణదేవిపేట అటవీ రేంజ్ పరిధిలో భీమవరం, నడింపాలెం, వలసంపేట, రామరాజుపాలెం, నల్లగొండ గ్రామాల్లో శుక్రవారం అటవీశాఖ సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ మానవ మనుగడకు తీవ్ర నష్టాన్ని తీసుకొస్తుందని, దీని వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. ఆరోగ్యశాఖ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి వితరణ

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని కేజే పురం జంక్షన్ సంతోషి మాత ఆలయానికి వెండి ఊయలను వితరణగా అందజేశారు. కింతలి గ్రామానికి చెందిన జితేంద్ర గుప్తా, అనిత దంపతులు ఆలయానికి తమ వంతు సహాయంగా వెండి ఊయల బహూకరించారు. ఆలయ చైర్మన్ కాళ్ళ అమ్మతల్లి నాయుడు సమక్షంలో అందచేశారు. వీరికి చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.



వెండి ఊయల ఇస్తున్న దాతలు

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

ప్రజాశక్తి - నర్సీపట్నంటౌన్: మండలంలోని గబ్బాడ సమీపంలో నెల్లిమెట్ట వద్ద గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామారావు తెలిపారు. ఏజెన్సీ చింతపల్లి పరిసర ప్రాంతాల్లో 8 కేజీల గంజాయి కొనుగోలు చేసి గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యలో వాహనాల తనిఖీ సందర్భంగా నిందితులు పట్టుబడ్డారని పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించామని ఎస్సై తెలిపారు.

సుందరయ్యకు ఘన నివాళి

పీడిత ప్రజల ప్రియతమ నేత, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని విశాఖ, అనకాపల్లి జిల్లాల వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

తగరపువలస : సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన తగరపువలస ప్రైవేట్ మార్కెట్ వై జంక్షన్‌లో, భీమిలి చిన్న బజారు జంక్షన్‌లో వర్ధంతిని జరిపారు. ఈ కార్యక్రమాల్లో సిఐటియు నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, ముఠా, ఆటో కార్మిక సంఘాల నాయకులు కొత్తయ్యరెడ్డి, నీలాతి రాము తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : భెల్ విశాఖ యూనిట్‌లో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిటిపి ప్రకాష్, ఎస్.జగన్నాధరావు, జి.రాంబాబు, బి.కృష్ణమూర్తి, పి.శివరాం, ఆర్.జనార్ధనరావు పాల్గొన్నారు.

జివిఎంసి 71వ వార్డు పరిధి సుందరయ్య కాలనీలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆరిలోవ : ఆరిలోవ సిపిఎం జోన్ ఆధ్వర్యాన 9, 10, 11, 12, 13 వార్డుల్లో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. సిపిఎం, సిఐటియు, ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కెఎస్‌వి.కమార్, వి.నరేంద్రకుమార్, పి.శంకరరావు, డి.నాగరాజు, ఐసి.నాయుడు, ఎస్.గౌరి, ఎ.రమణ, జి.నాగరాజు, బి.రత్నం, సన్యాసమ్మ, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురం సిఐటియు ఆఫీసులో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో కె.పెంటారావు, ఉరుకూటి బాబూరావు, ఆర్.విమల, కె.బంగారురాజు, గణేష్, బి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన 58వ వార్డు పరిధి గుల్లలపాలెం, 59వ వార్డు పరిధి నెహ్రూనగర్, 61వ వార్డు పరిధి మల్కాపురం, 62వ వార్డు పరిధి త్రినాధపురం, దుర్గానగర్, అల్లూరిసీతారామరాజు కాలనీ, 63వ వార్డు పరిధి క్రాంతినగర్, చింతల్లోవ ప్రాంతాల్లో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు పివి.బాస్కరరావు కె.పెంటారావు, జగ్గునాయుడు, టి.అప్పలస్వామి, ఆర్.కర్రెయ్య, వి.బాబూరావు, కె.పోలమ్మ ఆర్.లక్ష్మణమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 63వ వార్డు క్రాంతినగర్‌లో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలో అలుపెరగని కమ్యూనిస్టు పోరాటయోధుడు సుందరయ్య అన్నారు. దేశంలో మొదటి ప్రతిపక్షనేతగా పార్లమెంట్‌లో అడుగు పెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు లక్ష్మణమూర్తి, పి.సురేష్, పివి.భాస్కర్, గోపాల్, పొన్నాడ రామారావు ఎల్.కృష్ణ, రాజు, రాజేష్, రామునాయుడు, ఆర్.విమల, ఉమ, మమత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిఎం పాలెం : జివిఎంసి 6వ వార్డు పరిది పిఎం.పాలెం ఎస్‌బిఐ కూడలి వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎంవి.ప్రసాద్, డి.అప్పలరాజు, ఎస్.రామప్పడు, సిహెచ్.శేషుబాబు, కె.నాగరాజు, జి.కిరణ్, కె.రాజ, బి.రాంబాబు, కె.అర్జునమ్మ, ఉమ, జిఎ.రెడ్డి, ఆదిలక్ష్మి, శుభ, సూరిబాబు పాల్గొన్నారు.

మాధవధార : మాధవధారలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు సనపల ఆంజనేయులు, సనపల అమ్మలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కంచరపాలెం జోన్ కార్యదర్శి బి.పద్మ, సిఐటియు నాయకులు కూన వెంకటరావు, నాయకులు కూన పార్వతి, కె.సుధాకరరావు, ఎస్.రామ్‌గోపాల్‌రావు, కె.సత్యనారాయణ, పి రామచంద్రరావు, పి.పాండురంగారావు, జిఎన్.మూర్తి, సనపల కరుణ, నాయని బాబు, అనురాధ, నాయుడుబాబు, పి.శ్రీదేవి, ఎస్.శ్రావణ్‌కుమార్, కె.జనార్ధనమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 8వ వార్డు బింద్రానగర్ సుందరయ్య పార్కులో షిప్‌యార్డు లే-అవుట్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యాన సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్.బాబూరావు, ఇటి శేషగిరిరావు, జి.కిరణ్, సిహెచ్.సత్యానంద్, సిహెచ్.శేషుబాబు, గోవిందరాజు, బాపూజీ, రమేష్, బి.భారతి, డి.కొండమ్మ పాల్గొన్నారు.

పెందుర్తి : అప్పలనరసయ్య కాలనీ, చైతన్య నగర్ కార్మిక నగర్ పేపర్ కంపెనీ, పెందుర్తి సిఐటియు కార్యాలయంలో సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బి.జగన్, బిటి.మూర్తి, అప్పారావు, శంకరరావు, జగన్నాధంస్వామి, మౌలాలి, రజిని పాల్గొన్నారు.

కంచరపాలెం : కంచరపాలెంలోని బిఎన్‌ఆర్ భవనంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, చిన్న వయసులోనే పుస్తకాలు చదవడం, సామాజిక అంశాలను అధ్యయనం



నర్సీపట్నంలో...




అనకాపల్లిలో సుందరయ్య చిత్ర పటానికి నివాళ్లర్పిస్తున్న నాయకులు

చేశారన్నారు. భూ స్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ వ్యవసాయ కార్మికుల సమస్యలపై అధ్యయనం చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర నీటి పథకం అవకాశాలు, విశాలాంధ్రలో ప్రజారాజ్యం, విప్లవ పదంలో నా పయనం పుస్తకాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారు. సుందరయ్య అంటేనే ఒక మహాశక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.వెంకటరావు, ఎమ్.ఈశ్వరరావు, ఒ.అప్పారావు, ఎ.పుష్ప, రమణ, కె.రాంబాబు, ఎస్.అప్పలరాజు, పివి.రమణ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సింగ్ హోటల్ జంక్షన్‌లో సుందరయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది. కె.నర్సింగరావు అధ్యక్షత వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సింగనాయుడు, ఇతర నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విశాఖ జిల్లా మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు మాట్లాడారు. పూర్ణా మార్కెట్ స్ప్రింగ్ రోడ్ వద్ద ఎం.సుబ్బారావు అధ్యక్షతన సుందరయ్య వర్ధంతి కార్యక్రమం ముఠా కళాసీ యూనియన్ ఆధ్వర్యంలో జరిగింది. యూనియన్ గౌరవ అధ్యక్షులు వై.రాజు మాట్లాడారు. సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, వై.పైడిరాజు, నాయుడు పాల్గొన్నారు.

28వ వార్డులో సిఐటియు జగదాంబ జోన్, ఐద్వా కమిటీల ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమం చేపట్టారు. నాయకులు కె.మణి మాట్లాడారు. బి.సత్యవతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె నర్సింగరావు, సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి పాల్గొన్నారు.



కొత్తకోటలో...

ప్రజాశక్తి ఆధ్వర్యాన..

ఉక్కునగరం : ఆటోనగర్‌లోని ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పత్రిక జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడారు. జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు కె.అప్పలనాయుడు, వై.సత్యనారాయణ, విలేకరులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి : ఆదర్శ కమ్యూనిస్టుగా, ఆదర్శనేతగా, అజాతశత్రువుగా పిలవబడే సుందరయ్య నేటితరానికి ఆదర్శప్రాయుడని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ, సిపిఎం మండల కన్వీనర్ గంట శ్రీరామ్ అన్నారు. శుక్రవారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం నేతలు కె.ఈశ్వరరావు, బి.ఉమామహేశ్వరరావు, తేల్లయ్యబాబు, బి.నూకఅప్పారావు, కె.సుజాత, పి.చలపతి పాల్గొన్నారు.

మునగపాక రూరల్: మండల కేంద్రం మెయిన్ రోడ్డులో, గవర్ల అనకాపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని గ్రంథాలయంలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.వి శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎస్. బ్రహమ్మాజీ, టెక్కలి జగ్గారావు, వేగి మహేష్ , ఆదారి సత్యనారాయణ, మద్దాల పద్మ, వరలక్ష్మి, ద్వారంపూడి లక్ష్మి, ఆడారి శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, మంగ, ఇందిర, జగ్గయ్యమ్మ పాల్గొన్నారు. తోటాడలో సుందరయ్యకు ఆళ్ల మహేశ్వరరావు, ఆడారి రామలక్ష్మి, నిర్మలకుమారి, పెంటకోట జోగి నాయుడు పోలమరశెట్టి బాగేశ్వరరావు, మళ్ల సత్యనారాయణ, పోల్నాటి మహాలక్ష్మినాయుడు, దోడ్డి రాజమ్మ,దాడి శ్రీను, దోడ్డి సూర్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

దేవరాపల్లి : మండలంలోని పలుగ్రామాల్లో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొన్ని గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి, దొర, కె సన్యాసి, సిహెచ్ దేముడు, కె ఈశ్వరరావు, సిహెచ్ గంగులు, ఎం.దేముడు, నాగేశ్వరరావు, పి అప్పలరాజు, డి శంకర్, జి దేముడు, బి గోపాల్, డి దాసు పాల్గొన్నారు

పరవాడ: పరవాడ తహశీల్దార్ కార్యాలయ జంక్షన్‌లో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నేతలు ఎస్ రమణ, పి మాణిక్యం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.రమణ, తరుణ, జి వి ఎస్ తేజ, కె.మనోజ్, సిఐటియు నాయకులు రమణ, అనకాపల్లి వరలక్ష్మి, అనకాపల్లి చంద్రకళ పాల్గొన్నారు.

రాంబిల్లి : సుందరయ్య చిత్రపటానికి. సిపిఎం జిల్లా కార్యదర్సి జి.కోటేశ్వరరావు



కంచరపాలెంలో సుందరయ్య చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న గంగారావు

పూలమాల వేసి, నివాళ్ళు అర్పించారు. సిపిఎం కమిటి సభ్యులు జి. దేముడునాయుడు, మండల నాయకులు. ఎన్.నారాయణరావు, సిహెచ్.అప్పలరాజు, సిహెచ్. శివాజీ, వై.రాము, సిహెచ్.రామకృష్ణ, లక్ష్మినారాయణ.. డి.కాశియ్య, సిహెచ్. నూకన్న, ఇ.గంగాధరరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు: స్థానిక సిఐటియు కార్యాలయం సుందరయ్య చిత్రపటానికి ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, సిపిఎం మండల నాయకులు రంగలు ముత్యాలయుడు సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు, వరి వెంకట్రావు, గోగాడ ఈశ్వరమ్మ, శక్తి రమణ, వి.ఈశ్వరరావు, నాగరాజు, సూర్యదేవుడు పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని వంగలి, సబ్బవరం సాయినగర్ కాలనీలలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రభావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, నేతలు యర్రా సోంబాబు, మొల్లేటి గౌరీశ్వరరావు, యర్రా బుల్లిబాబు, జెట్టి వెంకటేష్, ముమ్మన శ్రీను పాల్గొన్నారు.

కశింకోట: సిఐటియు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో నిర్వహించిన సుందరయ్య వర్ధంతి వేడుకలలో సిఐటియు నేత దాకారపు శ్రీనివాసరావు, సిపిఎం నేత డి వరలక్ష్మి, ఆర్ శేషు, ఎమ్ ప్రభ, ఎమ్ అప్పలనర్సమ్మ, సీతా, కుమారి పాల్గొన్నారు

అచ్చుతాపురం మండలంలోని తిమ్మరాజుపేట, హరిపాలెం, అచ్చుతాపురం తదితరగ్రామాల్లో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు కర్రి అప్పారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొని కమ్యూనిస్టు గాంధీగా పేరుగాంచి దళితులు, రైతులు, వ్యవసాయ కార్మికులు సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయడంతోపాటు తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన సుందరయ్య పోరాటస్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని కోటేశ్వరరావు కొనియాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆర్ రాము, తిమ్మరాజుపేట శాఖ కార్యదర్శి ఎస్ రామ్ నాయుడు, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్ కనుమనాయుడు, బుద్ధ రంగారావు, కే సోమినాయుడు, ఆర్ లక్ష్మి, నడుపూరు సన్యాసిరావు పాల్గొన్నారు

నక్కపల్లి: కమ్యూనిస్టు నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్ లు మాట్లాడుతూ, ఆయన జీవితం పేదలకే అంకితం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరినికల రాము, పిక్కి రాజు, అయినవిల్లి లోవరాజు, మనబాల బంగారాజు, భరినికల చంటి, మనబాల రాజు, మనబాల వీరబాబు, గోసల రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోటలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సింగారపు వలసయ్య, పాడి బన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: పట్టణంలో సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి సత్తిబాబు, తదితరులు చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గీతాకృష్ణ, సాంబ, రాము తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల:మండలంలో సుందరయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అవురువాడ పంచాయతీ చినగొర్రె గెడ్డ గ్రామంలో ఉపాధి పనుల ప్రదేశంలో సుందరయ్యకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భవాని, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో..